క్లుప్తంగా

ఎంపీడీవోకు అభినందన



భట్టిప్రోలు: ఎంపీడీవోగా టి.ఊహారాణి బాధ్యతలు స్వీకరించడంతో మంగళవారం ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి ఆమెను సన్మానించి, అభినందించారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



కర్లపాలెం: పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని మండల అభివృద్ధి అధికారి కె.నేతాజీ తెలిపారు. కర్లపాలెం గ్రామ పంచాయతీలో జరుగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను ఆయన ఈవోపీఆర్డీ ఎలీషాబాబుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కర్లపాలెం పంచాయతీలో ప్రత్యేక పారిశుద్ధ్యం డ్రైవ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. వర్షాకాలంలో వీధులలో నీరు నిలిచి దోమలు ఉధృతి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈవోపీఆర్డీ ఎలీషా బాబు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని అన్ని వార్డులలో పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ హనుమంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కలుపు నివారణ చర్యలు చేపట్టాలి



నగరం: ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసే రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి వి.రమేష్‌బాబు చెప్పారు. మండలంలోని సజ్జావారిపాలెంలో వేస్తున్న వరి నాట్లను ఏవో పరిశీలించి, రైతులకు తగిన సూచనలిచ్చారు. వరి నాట్లు పూర్తయిన 20 రోజులకు కలుపు నివారణ మందులు పిచికారి చేయాలన్నారు. కలుపు మందు వేసేటప్పుడు పంట పొలంలో నీరు ఉండేలా చూసుకోవాలన్నారు. 2-4-డీ సోడియం సాల్ట్ ఎకరానికి 500గ్రాములు వేయడం వల్ల కలుపును నివారించవచ్చునన్నారు. రైతులు వ్యవసాయ నిపుణుల సలహాలు, సూచనల మేరకు మాత్రమే రసాయన మందులు వినియోగించాలన్నారనీ కార్యక్రమంలో ఏఈవో నాగశ్రీనివాస్, వీపీఏ ఎం.పూజ పాల్గొన్నారు.

నదీ తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



రేపల్లె రూరల్: ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు అధికంగా వస్తున్న నేపథ్యంలో మండలంలోని కృష్ణా నది పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసరావు కోరారు. కృష్ణానది పరీవాహక ప్రాంతంలోని వివిధ గ్రామాలను మంగళవారం సందర్శించి ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజ్ వద్ద నీటి మట్టం పెరుగుతున్న నేపథ్యంలో బ్యారేజ్ గేట్లు ఎత్తి దిగువకు వరద నీరు విడుదల చేసే అవకాశం ఉందన్నారు. గతంలో చోటుచేసుకున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. ప్రమాద హెచ్చరికలు జారీ చేసిన వెంటనే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు గాని, ప్రభుత్వం ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా మండలంలోని పెనుమూడి, మోర్తోట, గంగడిపాలెం తదితర గ్రామాలను సందర్శించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పాత కక్షల నేపథ్యంలో దాడి

తెనాలిరూరల్: పాత కక్షల నేపథ్యంలో యువకుడిపై దాడి చేసి గాయపర్చిన ఘటన తెనాలిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం పట్టణ మారిస్‌పేటకు చెందిన అబ్దుల్ రజాక్‌కు షేక్ షరీఫ్‌తో ఆస్తి వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో కబేళా వంతెన వద్ద మంగళవారం అబ్దుల్ రజాక్‌పై షరీఫ్ దాడి చేశాడు. బాధితుడిని స్థానికులు తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. తనపై స్క్రూ డ్రైవర్‌తో దాడి చేశాడని బాధితుడు ఆరోపిస్తున్నాడు. త్రీ టౌన్ పోలీసులు విచారిస్తున్నారు.

పాఠశాలల్లో ఎన్నికల సందడి

- రేపు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు
- విద్యా కమిటీలో సభ్యులకు రెండేళ్ల పదవీకాలం



ప్రభుత్వ పాఠశాల

పిట్టలవానిపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)ఎన్నికలు సందడి ప్రారంభమైంది. ప్రభుత్వ సూచనల మేరకు జిల్లా, మండల విద్యాశాఖాధికారులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు ఓటర్ల జాబితాను విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. ఈ నెల గురువారం పిట్టలవానిపాలెం మండలంలో 50 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, 5 మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, 5 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు జరగనున్నాయి.

పరిశీలకులు వీరే..

స్కూలు కమిటీ ఎన్నికల్లో ప్రధానోపాధ్యాయులు ఎన్నికల అధికారిగా ఉంటారు. తహసీల్దారు, ఎంపీడీఓ, వీఆర్వో ఎన్నికల పరిశీలకులుగా ఉంటారు. తల్లిదండ్రులు, పిల్లల సంరక్షకులుగా ఉన్న వారు ఓటర్లుగా ఉంటారు. సోమవారం ఓటర్ల జాబితా అభ్యంతరాల స్వీకరణ కార్యక్రమం పూర్తయ్యింది. 8న మధ్యాహ్నం ఒంటి గంట లోపు సభ్యులతో పాటు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు కమిటీ తొలి సమావేశం నిర్వహించాలి. పాఠశాల విద్యా కమిటీలో ప్రతి సభ్యుడికి రెండేళ్ల పదవీకాలం ఉంటుంది.

గత ప్రభుత్వంలో స్కూలు కమిటీలకు పెద్దపీట..

గత ప్రభుత్వంలో స్కూలు కమిటీ సభ్యులకు అధిక ప్రాధాన్యమిచ్చారు. నాడు–నేడు పనులు కమిటీ సభ్యులకు అప్పగించారు. దీంతో అభివృద్ధి పనులు ఎలాంటి ఆటంకం లేకుండా జరిగాయి. ప్రతి నెలా సమావేశం నిర్వహించి, విద్యార్థుల పురోగతి, పాఠశాల అభివృద్ధి పనులపై సమీక్ష చేసి, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకునేవారు. ఈ ఏడాది ప్రభుత్వం మారడంతో కూటమి పార్టీల నాయకులు పాఠశాల ఎన్నికలపై దృష్టి సారించారు. టీడీపీకి చెందిన వారినే చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఎన్నుకోవాలని ప్రయత్నాలు సాగుతున్నాయి. అలాగే క్షేత్రస్థాయిలో పట్టు సాధించేందుకు రాజకీయ పార్టీలకు పాఠశాల ఎన్నికలు వేదిక కావడంతో వైఎస్సార్ సీపీ నాయకులు కూడా గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. పాఠశాల ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రధానోపాధ్యాయులు, విద్యా శాఖాధికారులు దృష్టి సారించారు.

ఎన్నికల నిర్వహణ ఇలా..

పాఠశాలలో సెక్షన్‌లు, మీడియంతో సంబంధం లేకుండా తరగతి యూనిట్‌గా ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలి. వీరిలో కనీసం ఇద్దరు మహిళలు, ముగ్గురిలో ఒకరు తప్పకుండా ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతులు, మరొకరు బీసీ, ఈబీసీ, మైనార్టీకి చెందిన వ్యక్తి అయి ఉండాలి. తరగతి నుంచి సభ్యుల ఎన్నికకు 50 శాతం ఓటర్ల హాజరును రిజిస్టర్‌లో చూపిన తర్వాతనే ఎన్నిక జరపాలి. అలాగే చైర్మన్, ఉప చైర్మన్ ఎన్నికకు కూడా 50 శాతం సభ్యులు హాజరు ఉండాలి. క్లాసుల వారీగా ఎన్నికైన సభ్యులందరూ స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులుగా ఉంటారు. వారంతా కలిసి కమిటీ వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. అదేవిధంగా తరగతిలో కనీసం ఆరుగురు విద్యార్థులు లేకపోతే మరో తరగతిలోకి విలీనం చేసి ఎన్నుకోవాలి.

నీమాస్త్రంతో వరిలో ఆకుచుట్టు పురుగు మాయం



నీమాస్త్రం తయారు చేస్తున్న మహిళలు

పిట్టలవానిపాలెం: నీమాస్త్రం వినియోగించడం వల్ల వరిలో ఆకుచుట్టు పురుగును నివారించవచ్చని జీఎస్ పాలెం యూనిట్ ఎల్‌టీ ప్రవళిక తెలిపారు. మండలంలోని పోతనకట్ల వారిపాలెం గ్రామంలో నీమాస్త్రాన్ని తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిలో నీమాస్త్రం తయారు చేసుకుని వినియోగించడం వల్ల ఆకుచుట్టు పురుగును సమర్థంగా అరికట్ట వచ్చని తెలిపారు. దీని తయారీకి 10 కిలోల వేప ఆకులు, 2 కిలోల ఆవు పేడ, 10 లీటర్ల ఆవు మూత్రం, 200 లీటర్ల నీరు తీసుకుని ప్లాస్టిక్ డ్రమ్ముల్లో కలిపి 10 రోజుల పాటు మురగ బెట్టాలని తెలిపారు. అనంతరం వరిలో పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, జెడ్‌బీఎన్ఎఫ్ సిబ్బంది ఉన్నారు.

ఐలవరం హైస్కూల్‌కు చేరిన తైవాన్ బహుమతులు



బహుమతులను ఆవిష్కరిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఐలవరం(భట్టిప్రోలు): తైవాన్ దేశానికి చెందిన తై పై మున్సిపల్ ప్యూహి జూనియర్ హైస్కూల్ విద్యార్థులు మండలంలోని ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు బహుమతులు పంపారు. మంగళవారం అవి ఐలవరం హైస్కూల్‌కు చేరాయి. అందులో పెన్నులు, చాక్లెట్స్, బిస్కెట్స్, సర్టిఫికెట్స్ ఉన్నాయి. టిఫిని లీమన్‌పన్ హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయులు గత వేసవిలో ఫిలిప్పైన్స్ విద్యార్థులతో కలసి ఆన్‌లైన్‌లో ఒక ప్రాజెక్టును రూపొందించారు. ఆ ప్రాజెక్టులో ఇరుదేశాల విద్యార్థులు వారి సాంస్కృతి, సాంప్రదాయాలను ప్రదర్శించారు. దీనికి కొనసాగింపుగా ఆ దేశ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ బహుమతులను పంపడం జరిగిందని ఆంగ్లోపాధ్యాయుడు హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా హరికృష్ణను ప్రధానోపాధ్యాయుడు మాచర్ల మోహన్‌రావు, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

దశపర్ణి కషాయంతో తెగుళ్ల నివారణ

ప్రాజెక్ట్ మేనేజర్ వాణిశ్రీ



దశపర్ణి కషాయం తయారుచేస్తున్న డీపీఎం వాణిశ్రీ, రైతులు

కర్లపాలెం: దశపర్ణి కషాయంతో చీడపీడలను నివారించుకోవచ్చునని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాణిశ్రీ తెలిపారు. మండలంలోని సమ్మెటవారిపాలెంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు జరిగిన అవగాహన సదస్సులో డీపీఎం వాణిశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతం అవుతుందని చెప్పారు. దశపర్ణి కషాయం తయారు చేయుటకు కేజీ పసుపు, అర కేజీ అల్లం, అర కేజీ చిన్నుల్లి, 2 కేజీల పచ్చిమిర్చి, 200 గ్రాముల శొంఠి, 10 లీటర్ల ఆవు మూత్రం, 5 కేజీల ఆవుపేడ, పది రకాలైన చెట్ల ఆకులు కావాలని చెప్పారు. వీటిని పేస్ట్‌లా తయారు చేసుకుని 150 లీటర్ల నీటిలో కలుపుకుని 40 రోజుల పాటు నీడలో నిలువ చేయాలని వివరించారు. ఈ కషాయాన్ని 41వ రోజు నుంచి 19 లీటర్ల నీటిలో లీటరు కషాయాన్ని కలిపి అన్ని రకాల చీడపీడల నివారణకు పైరుపై పిచికారీ చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం బాపట్ల డివిజన్ మాస్టర్ ట్రైనర్ గంజి శ్రీకాంత్, యూనిట్ ఇన్‌చార్జి సత్యనారాయణ, రవి, శంకర్, రైతులు పాల్గొన్నారు.

మానసిక రుగ్మతలపై అవగాహన అవసరం

తెనాలిఅర్బన్: మానసిక రుగ్మతలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రావణ్‌బాబు సూచించారు. జాతీయ మానసిక ఆరోగ్య అవగాహన దినోత్సవం పురస్కరించుకుని జిల్లా వైద్యశాలలో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పుల వలన అనేక మంది మానసిక వ్యాధులకు గురవుతున్నారని తెలిపారు. జీవనశైలిలో పనిఒత్తిడి తగ్గించుకోవాలని సూచించారు. ఎవరికైనా మానసిక సమస్యలు ఉంటే వెంటనే మానసిక వైద్యులను కలవాలన్నారు. జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవడంతో పాటు పనిఒత్తిడిని తగ్గించుకోవాలన్నారు. మనస్సును ప్రశాంతంగా ఉంచుకునే విధంగా చూసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్ఎంఓ డాక్టర్ మల్లిఖార్జునరావు, ఏఓ డాక్టర్ మజీదబేగం, డాక్టర్ మధుబాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎం.రాజేశ్వరి, ప్రోగ్రామ్ మేనేజర్ గిరిధర్, సిబ్బంది శ్రావణి, చిన్న బాలయ్య, జాస్మిన్, గాయత్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణ సభను విజయవంతం చేయండి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: రణరంగ చౌక్ వద్ద ఈ నెల 12న నిర్వహించనున్న అమరవీరుల సంస్మరణ సభలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సభకు అవసరమైన ఏర్పాట్లను చేయాలని సూచించారు. అలాగే పెద్దసంఖ్యలో ప్రజలు కూడా హాజరయ్యే విధంగా చూడాలన్నారు. సమావేశంలో కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ అనూష, ఇన్‌ఛార్జి ఎంఈ శ్రీనివాసరావు, ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, మేనేజర్ అప్పలరాజు, ఏసీపీ సుబ్బారావు, ఆర్ఓ సోమశేఖర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత మృతికి కారణమైన యువకుడి అరెస్ట్

కర్లపాలెం: మండలంలోని నల్లమోతువారిపాలేనికి చెందిన వివాహిత యువతి సూరగాని దుర్గా భవాని(33) ఈ నెల 2న పురుగు మందు తాగి, ఆత్మహత్య చేసుకుంది. ఈ నేపథ్యంలో ఏట్రవారిపాలేనికి చెందిన గోపిరెడ్డి అనే వ్యక్తి తన భార్యను కొట్టడం వల్లే ఆమె మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుందని దుర్గా భవాని భర్త శ్రీనివాసరావు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం గోపిరెడ్డిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపినట్లు కర్లపాలెం ఇన్‌చార్జి ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కొల్లూరు : ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసిన ఘటన కొల్లూరులో చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పెసర్లంక ప్రాంతం నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కొల్లూరు డెప్యూటీ తహసీల్దారు నిరంజన్ సిబ్బందితో కలసి నిలువరించారు. ఇసుక తరలింపునకు సంబంధించి ఎటువంటి బిల్లులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి, తహసీల్దారు బి.వెంకటేశ్వర్లుకు కేసు బదిలీ చేసినట్లు ఏఎస్ఐ అర్జున్ తెలిపారు.

ఆ నాలుగు గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా



పిట్టలవానిపాలెం: మండలంలోని నడిముల్లాయపాలెం, భవనంవారి పాలెం, కోమలి, చోడిపాలెం గ్రామస్తుల చిరకాల వాంఛ నెరవేరింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న 24 గంటల విద్యుత్ సౌకర్యం ఎట్టకేలకు తీరింది.ఇటీవల చందోలు గ్రామంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ఆయా గ్రామాలకు 24 గంటలు విద్యుత్ సరఫరాను మండల విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

తెనాలి రూరల్: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొలనుకొండ స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొలనుకొండకు చెందిన షేక్ మస్తాన్(35) స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరాటే క్రీడాకారిణి లాలిత్యకు సన్మానం



తెనాలిఅర్బన్: జాతీయస్థాయి కరాటే చాంపియన్ షిప్‌లో ప్రథమస్థానం సాధించిన వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల విద్యార్థిని, కఠెవరం గ్రామవాసి కె.లాలిత్యను మంగళవారం పలువురు అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రవీంద్రనాథ్ మాట్లాడుతూ అమరపిని షోటకాన్ కరాటే వారి ఆధ్వర్యంలో విశాఖపట్నం గాజువాకలో ఈ నెల 4న జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి అశోక్, వెంకట్, కోచ్ కిరణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించుకోకుంటే.. నిధులు కట్..



హౌసింగ్ నిర్మాణాలపై మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసమూర్తి

చెరుకుపల్లి: గత ప్రభుత్వంలో ఇళ్లు కట్టుకునేందుకు అనుమతి పొంది, వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను డిసెంబరు 31వ తేదీ లోపు పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో బి.శ్రీనివాసమూర్తి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం హౌసింగ్ ఏఈ, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మండలంలో నిర్మాణంలో ఉన్న ఇళ్ల ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గతంలో ఇల్లు మంజూరు అయ్యి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు 2024 డిసెంబరు 31నాటికి పూర్తి చేసుకోవాలని, లేని పక్షంలో వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు నిలిపివేయబడతాయని స్పష్టం చేశారు. తర్వాత ఆ నగదు వచ్చే అవకాశమే లేదన్నారు పేర్కొన్నారు. అంతే కాకుండా గతంలో ఇంటి నిర్మాణానికి అనుమతులు పొంది, ఇల్లు నిర్మాణం ప్రారంభించకుండా ఉన్న లబ్ధిదారులు వారి ఖాతాలో రూ.5వేలు జమ కాబడినవారు ఆ నగదును వెంటనే వెనక్కి తిరిగి సంబంధిత అధికారులకు చెల్లించాలన్నారు. దీంతో ప్రస్తుత ప్రభుత్వంలో మరోమారు హౌసింగ్ స్కీంకు ఎలిజిబుల్ అవుతారని, లేని పక్షంలో ప్రభుత్వ స్కీంలో ఇల్లు కట్టుకునే అవకాశం ఉండదని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ లక్ష్మీనారాయణ, జచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలి



మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

కర్లపాలెం: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు తెలిపారు. రమ్య ఫ్యాన్సీ అండ్ బుక్‌స్టాల్, ఆర్య వైశ్యుల ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటి, నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణులకు కావాల్సిన ఆక్సిజన్‌ను అందించే పచ్చని చెట్లను పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ అందరూ ఉద్యమంలా మొక్కలు పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త ఎస్.శివన్నారాయణ, నాయకులు పిట్ల వసంతరెడ్డి, బాజీ, పఠాన్, వెంకటరామరాజు, మాడా శ్రీనివాసరావు, గోపి, ఆర్యవైశ్యులు రమేష్, కిషోర్, శ్రీనివాసరావు, గుప్త తదితరులు ఉన్నారు.

సుస్థిర సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు



భీజామృతంతో వరినారు శుద్ధి..

పిట్టలవానిపాలెం: సుస్థిర సేంద్రియ వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని మంతెనవారిపాలెం యూనిట్ ఎల్‌టీ సౌజన్య తెలిపారు. మండల కేంద్రంలోని రైతు అంజిరెడ్డి వరి పొలంలో మంగళవారం వరినారుమడిని శుద్ధి చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భీజామృతంతో వరినారును శుద్ధి చేయడం వల్ల వరిలో సంక్రమించే పలు రకాల తెగుళ్లు, చీడపీడలు ఆశించకుండా ఉంటాయని తెలిపారు. నారు శుద్ధి చేయడం వల్ల వేరు వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని తద్వారా అధిక శాతం పిలకలు రావడానికి అవకాశం ఉందని తెలిపారు. 10 లీటర్ల ఆవు మూత్రం, 20 లీటర్ల నీరు, 5 కిలోల ఆవుపేడ, పుట్ట మన్ను గుప్పెడు, 100 గ్రాముల సున్నం మిశ్రమాన్ని కలియబెట్టాలని తెలిపారు. ఈ మిశ్రమంతో వరి నారును శుద్ధి చేయాలని సూచించారు. వరి కొనలు తుంచి నాటు వేయడం వల్ల వరిలో ఆకుచుట్టు పురుగు నివారించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌బీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు ఉన్నారు.

కమ్యూనిటీ హాలును గ్రామ పెద్దలకు అప్పగించాలి



ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సింగుపాలెం గ్రామస్తులు

రేపల్లె రూరల్: సింగుపాలెం పంచాయతీ దళితవాడలోని కమ్యూనిటీ హాలును ఆ గ్రామ పెద్దలకు అప్పజెప్పాలని సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ మాట్లాడుతూ గ్రామంలోని పలువురికి ఉపయోగపడే కమ్యూనిటీ హాలుకు పంచాయతీ అధికారులు తాళాలు వేసి వారి ఆధీనంలోకి తీసుకోవడం తగదన్నారు. గత పది సంవత్సరాల నుంచి కమ్యూనిటీ హాలును పలు అవసరాలకు గ్రామస్తులు వినియోగించుకుంటున్నారని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కమ్యూనిటీ హాలను గ్రామ పెద్దలకు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోనే సోమయ్య, గాలి రామకోటి, గాలి ఏసోబు, కోటేశ్వరరావు, దానియేలు, రాహేలు, గోపి రాజ్, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, సీపీఎం నాయకులు కె.అశీర్వాదం, కె.రమేష్, బి.అగస్టీన్, కే.మరిదాస్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడవచ్చు



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరరావు

బాపట్ల: కార్డియాక్ అరెస్టు అయిన వెంటనే సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడవచ్చని రెడ్‌క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా కో–ఆర్డినేటర్ పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా రెడ్ క్రాస్ కో–ఆర్డినేటర్ బి.ఎస్.నారాయణ భట్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు గుండె నొప్పి వచ్చిన వెంటనే చేయాల్సిన సీపీఆర్ గురించి వివరించారు. విద్యార్థులతో సీపీఆర్ ఏ విధంగా చేయాలని చేయించి, చూపించారు. ఈకార్యక్రమంలో బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ జి. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ హరిత, జాతీయ సేవా విభాగం అధికారులు కె.కృష్ణకుమారి, జి కల్యాణి సమన్వయకర్తలుగా వ్యవహరించారు. రెడ్ క్రాస్ బృందం పాల్గొంది.

పారిశుద్ధ్య నిర్వహణ సమర్థంగా ఉండాలి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: పారిశుద్ధ్య నిర్వహణను సమర్థంగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. 10వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి రోజు చెత్త సేకరణ జరగాలన్నారు. చెత్తను వేరువేరుగా సేకరించాలని తెలిపారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.